# గ్రూప్-1పై కాంగ్రెస్ డైవర్షన్

- అభ్యర్థులను తప్పుదోవ పట్టించే వ్యూహం
- మంత్రి పొన్నం ఇంట్లో మంత్రుల భేటీ
- ఆదివారం కీలక ప్రకటన అంటూ లీకులు
- మంత్రులు మీడియాతో మాట్లాడుతారని ప్రచారం
- తీరా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ ప్రెస్‌మీట్‌తోనే సరి

హైదరాబాద్, అక్టోబర్ 20(నమస్తే తెలంగాణ): తమ సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం లీక్‌లతో తప్పుదారి పట్టించే వ్యూహం అవలంబిస్తున్నదని గ్రూప్-1 అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండ్రోజులుగా జరుగుతున్న పరిణామాలే ఇందుకు నిదర్శనమని చెప్తున్నారు. గ్రూప్-1 వివాదంపై శనివారం రాత్రి మంత్రులు, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ హంగామా చేశారు. హడావుడిగా రాత్రిపూట మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంట్లో మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ, ఇతర శాఖల ఉన్నతాధికారులతో గ్రూప్-1 వివాదంపై చర్చించినట్టు లీకులిచ్చారు. గ్రూప్-1 అభ్యర్థుల డిమాండ్లపై ఆదివారం ప్రభుత్వం సమగ్ర ప్రకటన చేస్తుందని, పలువురు మంత్రులు మీడియా సమావేశాలు నిర్వహిస్తారనే ప్రచారం జరిగింది. కానీ, ఆదివారం ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనా విడుదల కాలేదు. పీసీసీ అధ్యక్షుడితో మీడియా సమావేశం నిర్వహించి వివరణ ఇప్పించారు. పార్టీ అధ్యక్షుడైన ఆయన.. ఇటు ప్రభుత్వ పరంగా అటు పార్టీ పరంగా వత్తాసు పలికారు. అధికారుల నుంచి అన్ని వివరాలు తెలుసుకున్నామని, జీవో 29తో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదని మహేశ్‌కుమార్ చెప్పారు. అప్పటికే గ్రూప్-1 అభ్యర్థులు రగిలిపోతున్నారు. లాఠీచార్జితో వారిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. మరోవైపు, ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తున్నది. దీంతో విద్యార్థులు తమ ఆందోళనలను మరింత ఉధృతం చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో వీరిని పక్కదారి పట్టించేందుకు, వారి ఆందోళనను విరమింపచేసేందుకు ప్రభుత్వం లీకుల వ్యూహం అవలంబించిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

## సీఎంకు జీవో-317 నివేదిక

### సీల్డ్‌కవర్‌లో సమర్పించిన మంత్రివర్గ ఉపసంఘం



సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక అందిస్తున్న మంత్రులు దుద్దిళ్ల, దామోదర

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయుల కేటాయింపునకు జారీచేసిన జీవో-317 సమీక్ష కోసం ప్రభుత్వం నియమించి క్యాబినెట్ సబ్‌కమిటీ తన నివేదికను ఆదివారం ప్రభుత్వానికి సమర్పించింది. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు సీల్డ్‌కవర్‌లో ఆ నివేదిను అందజేశారు. వైద్యారోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతోపాటు మేధావులతో చర్చించింది. ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో కమిటీ పిటిషన్లను స్వీకరించింది. పలు సమీక్షలు నిర్వహించింది. ముఖ్యంగా 13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారితో చర్చించింది. పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా ఉద్యోగులు కోరారు. నివేదిక సమర్పణలో జాప్యాన్ని నిరసిస్తూ జీవో-317 బాధితులు ఇటీవల గాంధీభవన్‌ను ముట్టడించారు. ఈ నేపథ్యంలోనే మంత్రులు వారితో సంప్రదింపులు జరిపారు.

## జీవో 29ని ఉపసంహరించుకోవాలి

### సీఎంకు కేంద్రమంత్రి బండి లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 20(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం పంతాలు, పట్టింపులకు పోకుండా వెంటనే జీవో 29ని ఉపసంహరించుకోవాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ జీవో రాజ్యాంగ స్ఫూర్తికి, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు విరుద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్టు తెలిపారు. సోమవారమే పరీక్షలని తెలిసి ఆందోళన చేస్తున్న నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకోవాలని కోరారు. 563 గ్రూప్-1 పోస్టులకు రిజర్వేషన్లు పాటించకుండా 1:50 చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం మెయిన్స్ పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని కోరారు.

# చుట్టాలకు కొలువులు కట్టబెట్టే కుట్ర

- రేవంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి బంధువులకు డీఎస్పీ, ఆర్డీవో ఉద్యోగాలిచ్చే పన్నాగం
- రూల్స్ మార్చి దొడ్డిదారిన హాల్‌టికెట్లు
- అందుకే హడావుడిగా గ్రూప్-1 పరీక్షలు
- కాదని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా
- బండి సంజయ్‌కి దమ్ముంటే సుప్రీంకోర్టులో నిరుద్యోగుల కోసం సీనియర్ లాయర్లను పెట్టాలి
- బీఆర్‌ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్



తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): తమ చుట్టాలు, పక్కాలకు డీఎస్పీ, ఆర్డీవో ఉద్యోగాలు కట్టబెట్టేందుకు రేవంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి రూల్స్ మార్చి దొడ్డిదారిన గ్రూప్-1 హాల్‌టికెట్లు ఇప్పించారని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కాదని నిరూపిస్తే బహిరంగ క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు. 563 పోస్టులకు 1:50 చొప్పున 28,150 మంది మాత్రమే మెయిన్‌కు రావాల్సి ఉండగా..31,382 మందిని ఎలా ఎంపికచేశారు? అని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎవరి కోసం ఇంత హడావుడిగా పరీక్షలు పెడుతున్నారని నిప్పులు చెరిగారు. ప్రత్యేకంగా ఒక వర్గానికి ఎక్కువ ఉద్యోగాలు వచ్చేలా కుట్ర జరుగుతున్నదని చెప్పారు. 'ఇదేం రేవంత్‌రెడ్డి ప్రైవేట్ ఎస్టేట్ రిక్రూట్‌మెంట్ కాదు' అని మండిపడ్డారు. ఎన్టీఆర్ కంటే రేవంత్‌రెడ్డి గొప్పోడేమీ కాదని, తాను ఇచ్చిన జీవోను 24 గంటల్లో ఎన్టీఆర్ వెనక్కి తీసుకున్నారని గుర్తుచేశారు. నిరుద్యోగుల జీవితాల్లో మట్టికొట్టి మొండితనం, మూర్ఖత్వంతో ఎందుకు ముందుకెళ్తున్నారు? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన బీఆర్‌ఎస్ నేతలు పల్లె రవికుమార్, తుంగ బాలు, కిశోర్‌గౌడ్‌తోపాటు గ్రూప్-1 అభ్యర్థులతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అత్తెసరు చదువు చదివారు.. మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులైనా ఆయనకు గ్రూప్-1 పోస్టుల ప్రాధ్యానం గురించి చెప్పాలి' అని సూచించారు. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, సీఎం ఇద్దరూ కలిసి గ్రూప్ -1 అభ్యర్థులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు సోమవారం తీర్పు ఇచ్చేలోపు జీవోను రద్దు చేసి పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. రెండు నెలలు పరీక్ష ఆలస్యమైతే రేవంత్‌రెడ్డికి ఇబ్బంది ఏమిటి? అని నిలదీశారు. అగ్రవర్ణ మనస్తత్వంతో మహేందర్‌రెడ్డి వ్యవహరించారని ఆరోపించారు. కోర్టును సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన జీవో 55 అన్నివర్గాలకు న్యాయం చేసిందని, రేవంత్‌రెడ్డి సర్కార్ జీవో 29ని తీసుకొచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగుల జీవితాలను మంటగలిపారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగుతున్నదని, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి కూడా రేవంత్ అడుగుజాడలో నడుస్తున్నారని విమర్శించారు. గ్రూప్-1 ప్రిలిమినరీలో 14 ప్రశ్నలకు తెలుగు అకాడమీ పుస్తకంలోని సమాధానాలు రాస్తే తప్పు అంటున్నారని,

> కేంద్రమంత్రి బండి సంజయ్ ఫోన్ చేయగానే మాట్లాడే రేవంత్‌రెడ్డి.. గ్రూప్-1 అభ్యర్థులను ఎందుకు కలవరు? ఇద్దరి మధ్య లోపాయికారి ఒప్పందం ఉన్నదా? -దాసోజు శ్రవణ్

తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాదంటున్న ప్రభుత్వం వికీపీడియా చెప్పింది ఎలా ప్రామాణికమవుతుందో చెప్పాలని నిలదీశారు. కోర్టుకు వెళ్లి పరీక్షకు ఒక్కరోజు ముందు స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు హాల్‌టికెట్లు పొందారని గుర్తుచేశారు. వారు ఎప్పుడు ప్రిపేర్ అవుతారు? ఎలా పరీక్ష రాస్తారు? అని ప్రశ్నించారు. హిట్లర్ కంటే దారుణంగా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని, కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టిన నిరుద్యోగులే సమయం వచ్చినప్పుడు రేవంత్‌రెడ్డికి కర్రు కాల్చి వాతపెడతారని హెచ్చరించారు.

### గ్రూప్స్ అభ్యర్థులకు కేంద్రంగా తెలంగాణభవన్

గ్రూప్స్ అభ్యర్థులకు తెలంగాణభవన్ కేంద్రంగా మారిందని, అభ్యర్థులు తమ బాధలు చెప్పుకోవడానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారని దాసోజు శ్రవణ్ చెప్పారు. నిరుద్యోగులకు సంఘీభావం తెలిపేందుకు అశోక్‌నగర్‌కు బీఆర్‌ఎస్ నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్ ఇతర నాయకులమంతా కలిసి వెళ్లామని తెలిపారు. బీఆర్‌ఎస్‌కు ఎక్కడ క్రెడిట్ దక్కుతుందోనని, ఎక్కడ ఈటల రాజేందర్ హైలైట్ అవుతారోనని బండి సంజయ్ అశోక్‌నగర్ నుంచి బరాత్ తీశారని ఎద్దేవాచేశారు. తమను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు.. సంజయ్‌ని మాత్రం తన పార్టీ కార్యాలయంలో వదిలేశారని విమర్శించారు. డ్రామా చేసి నిరుద్యోగుల సమస్యను బండి సంజయ్ తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. తనను అడ్డుకున్నాడనే ఆగ్రహంతో బీసీవర్గానికి చెందిన సీఐని బండి సంజయ్ బదిలీ చేయించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అడ్డగోలుగా మాట్లాడటం తగదని సూచించారు. 'ఎవరైనా నీ అవ్వ.. అంటారా?' అని నిలదీశారు. ఎవరికైనా అమ్మ అమ్మే అవుతుందని, ఇదేనా తల్లిదండ్రుల పట్ల ఆర్‌ఎస్‌ఎస్ ఆయనకు నేర్పిన సంస్కారం? అని ప్రశ్నించారు. నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేసే దమ్ముంటే సుప్రీంకోర్టులో సీనియర్ లాయర్లను పెట్టి నిరుద్యోగుల తరఫున వాదించాలని డిమాండ్ చేశారు. తక్షణమే జీవో 29ని రద్దు చేసి గ్రూప్-1 పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

> కార్పొరేటర్ మనస్తత్వాన్ని బండి సంజయ్, జడ్పీటీసీ మనస్తత్వాన్ని రేవంత్‌రెడ్డి వీడడం లేదు. ఓ చానల్ ఇంటర్వ్యూలో రేవంత్‌రెడ్డి తాను రాజకీయ నేతను కాకపోయి ఉంటే రౌడీని అయ్యేవాడిని అన్నడు. అంటే ఇప్పుడు నిరుద్యోగులపై రౌడీ బుద్ధి చూపిస్తున్నవా? -దాసోజు శ్రవణ్

### జీవో 29తో నష్టపోతున్నాం

జీవో 29 వల్ల మేము తీవ్రంగా నష్టపోతున్నాం. అభ్యర్థుల ఒపీనియన్ తీసుకొని గరిష్ఠ సభ్యుల అభిప్రాయం మేరకు పరీక్ష నిర్వహించాలి. ఏకపక్షంగా గ్రూప్-1 పరీక్ష నిర్వహించడం తగదు. అన్ని కేసులు పరిష్కారమైన తర్వాతే పరీక్షలు సజావుగా నిర్వహించాలి. మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థుల పేర్లు మాత్రమే ప్రకటించారు. కానీ, వారికి వచ్చిన మార్కులు, క్యాటగిరీ, కటాఫ్ వంటివి వెల్లడించలేదు. నిబంధనల ప్రకారం పరీక్ష నిర్వహించాలి.

-ఝాన్సీరాణి, గ్రూప్-1 అభ్యర్థి

> జనరల్, రిజర్వుడు, లోకల్, నాన్ లోకల్, స్పోర్ట్స్ కోటా కటాఫ్ మార్కులు ఎన్ని? ఆ వివరాలు ఎందుకు చెప్పరు? గ్రూప్-1 మెయిన్స్‌కు బీసీ అభ్యర్థులను 1:50, ఓసీలను 1:65 నిష్పత్తిలో ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారు? -దాసోజు శ్రవణ్

# జీవో 29తో రిజర్వ్‌డ్ క్యాటగిరీకి నష్టం

- జీవో-29.. జీవో 55 తేడాలివే!
- గ్రూప్-1 అభ్యర్థుల గట్టి వాదన

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): గతంలో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి కేసీఆర్ సర్కారు జారీచేసిన జీవో-55ను సవరించి, కాంగ్రెస్ సర్కారు జీవో-29ని తీసుకొచ్చింది. జీవో-55లోని పేరా-బీని ఇప్పటి సర్కారు మార్చింది. ఇదే ఇప్పుడు రాష్ట్రాన్ని రణరంగంగా మార్చింది. రేవంత్‌రెడ్డి సర్కారును వణికిస్తున్నది. ఈ జీవోతో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించలేదని అభ్యర్థులు మొత్తుకుంటున్నారు. జీవో-29ని రద్దు చేయకపోతే మరో రిజర్వేషన్ పరిరక్షణ ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరిస్తున్నారు.

### జీవో-29 ప్రకారం..

జీవో-29 ప్రకారం 1:50 డైరెక్ట్ ఓపెన్ మెరిట్ ఎంపిక విధానం ద్వారా మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపికచేశారు. ఈ ప్రక్రియలో మొదట మెరిట్‌ను అనుసరించారు. ఆ తర్వాత రిజర్వ్‌డ్ పోస్టులకు 1:50 చొప్పున అభ్యర్థులను ఎంపికచేశారు. ఈ ప్రక్రియలో ఓపెన్ మెరిట్‌లో రిజర్వ్‌డ్ అభ్యర్థులకు అవకాశం ఉండదు. టాప్ మార్కులొచ్చినా ఓపెన్ కోటాలో అభ్యర్థిని రిజర్వేషన్ పూల్‌లోకి తోశారు. అదే మెరిట్ అభ్యర్థిని ఓపెన్ కోటాలో చేర్చితే, మరో రిజర్వ్‌డ్ అభ్యర్థికి అదనంగా అవకాశం దక్కేది. ఇలా రిజర్వుడు వర్గాలకు అన్యాయం జరిగిందన్నది అభ్యర్థుల ఆరోపణ.

### జీవో 55 ప్రకారం..

జీవో-55 ప్రకారం ఓపెన్ కోటా ఉద్యోగాలను రిజర్వేషన్ సహా అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారిని ఎంపికచేశారు. గతంలో 209 రిజర్వ్‌డ్ పోస్టులకు 1:50 ఓపెన్ మెరిట్ విధానం ప్రకారం ఎంపికచేశారు. దీంట్లో ఓసీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, వికలాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్, స్పోర్ట్స్ కోటా అందరూ ఉంటారు. వీరంతా పూర్తిగా మెరిట్ విద్యార్థులే. మిగిలిన 354 రిజర్వ్‌డ్ పోస్టులకు 10,451 ర్యాంక్ నుంచి ఆయా రిజర్వేషన్ కోటాలో ఎస్సీ, ఎస్టీ, బీసీల కులాలకు చెందిన వారిని 1:50 ప్రకారం ఎంపికచేశారు.

## గ్రూప్-1 మెయిన్స్‌కు భారీ బందోబస్తు

- నేటి నుంచి 46 కేంద్రాల్లో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు
- సెంటర్‌కు 20 మందికిపైగా పోలీసులతో బందోబస్తు

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష కేంద్రాల్లో ప్రభుత్వం భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నది. సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఒక్కో కేంద్రంలో 20 మందికి పైగా పోలీసులు విధుల్లో ఉంటారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలోనే ఈ పరీక్షలు జరుగుతాయి. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనర్లు, జిల్లా అదనపు కలెక్టర్లు సైతం తనిఖీలు నిర్వహిస్తారు. జీవో-29పై సోమవార ఉదయమే సుప్రీంకోర్టులో కేసు విచారణకు రానున్నది. సుప్రీంతీర్పు నేపథ్యంలో అంతటా ఉత్కంఠ నెలకొన్నది. మధ్యాహ్నం నుంచే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. మొత్తంగా 31,383 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోనే పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు.

## జీవో 29తో ఎలాంటి నష్టం లేదు

### గ్రూప్-1 వివాదంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 20(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29తో గ్రూప్-1 అభ్యర్థులకు ఎలాంటి నష్టం లేదని, లాభమే జరుగుతుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. తాను తెలుసుకున్న సమాచారం ప్రకారం జీవో 29 వల్ల 75 నుంచి 80 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులే మెయిన్స్‌కు ఎంపికవుతారని తెలిపారు. సమాచారంలోపం వల్ల ఈ సమస్య ఏర్పడిందని, దీనిపై చాలా మంది అపోహ పడుతున్నారని పేర్కొన్నారు. గ్రూప్-1 వివాదం, విద్యార్థుల ఆందోళనపై ఆదివారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. అర్థం చేసుకొని, ప్రశాంతంగా పరీక్ష రాయాలని అభ్యర్థులకు సూచించారు.

## నిరుద్యోగులపై కాంగ్రెస్ దమనకాండ

- కాంగ్రెస్ దురహంకారానికి ఇదే నిదర్శనం
- సీఎం రేవంత్‌రెడ్డి హిందూ వ్యతిరేకి: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్20 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసుల లాఠీచార్జి చేయడంతోపాటు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, ఇది కాంగ్రెస్ దురహంకారానికి నిదర్శనమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు అశోక్‌నగర్ వెళ్లిన రేవంత్‌రెడ్డి ఇప్పుడెందుకు వెళ్లరని నిలదీశారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం కాకముందు అశోక్‌నగర్ లైబ్రరీకి వెళ్లి అనేక కబుర్లు చెప్పి, ఇప్పుడేమో ఏకంగా లాఠీచార్జికి దిగుతారా? అని ఆరోపించారు. అభ్యర్థులతో ఒకసారి చర్చిస్తే పోయేదేముందని నిలదీశారు. ఉద్యోగాలను భర్తీ చేసే చిత్తశుద్ధి ఉంటే నిరుద్యోగులు, విద్యార్థులతో మాట్లాడాలని, ధైర్యం లేకపోతే పోలీసులను వెంట బెట్టుకొని అశోక్‌నగర్ వెళ్లాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కనీస ఇంగిత జ్ఞానం లేకుండా వ్యవహరిస్తున్నదని, వికీపీడియా, గూగుల్ ఆధారంగా పరీక్షలు రాయమంటారా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ధర్నాలు, నిరసనలు చేసే హక్కులేదా? అని ప్రశ్నించారు. ముత్యాలమ్మ ఆలయ ధ్వంసం విషయంపై హిందూ సంఘాలపై పోలీసుల దౌర్జన్య కాండను కిషన్‌రెడ్డి ఖండించారు. సీఎం రేవంత్ హిందూ వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్నారని ఆరోపించారు.





ఆదివారం గాంధీభవన్ వద్ద ఓయూ జేఏసీ నాయకుడు మోతీలాల్‌నాయక్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు, అశోక్‌నగర్ చౌరస్తాలో గ్రూప్-1 అభ్యర్థిని అరెస్టు చేస్తున్న పోలీసులు

# నిరుద్యోగుల గొంతునొక్కిన సర్కార్

- ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతుండగా అరెస్టు చేసిన పోలీసులు
- గోడు చెప్పుకునే అవకాశం ఇవ్వకుండా దౌర్జన్యం

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): ఉద్యోగార్థులపై మళ్లీ పోలీసులు తమ ప్రతాపం చూపారు. కనీసం గోడు చెప్పుకునే అవకాశం ఇవ్వకుండా నిరంకుశంగా వ్యవహరించారు. ఆదివారం హైదరాబాద్ అశోక్‌నగర్‌లో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతుండగానే ఈడ్చుకెళ్లి కర్కశంగా ప్రవర్తించారు. 'నిరుద్యోగులు భావోద్వేగంలో ఉన్నరు. లాఠీచార్జి చేయొద్దు. కేసులు పెట్టొద్దు. సంయమనం పాటించండి' అని సీఎం రేవంత్‌రెడ్డి పోలీసులకు ఆదేశాలు జారీచేసిన తెల్లారి కూడా ఇదే దమననీతిని ప్రదర్శించడం గమనార్హం. ఆదివారం చోటుచేసుకున్న ఈ పరిణామాలే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహించి తీరుతామని మొండిగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు అభ్యర్థులు ప్రయత్నించారు. ఓ ముగ్గురు మీడియాతో మాట్లాడగా, మరొకరు మాట్లాడే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు ఈడ్చుకెళ్లి వ్యాన్లలోకి ఎక్కించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. సీఎం రేవంత్‌కు జీవోలపై కనీస అవగాహన లేదని అభ్యర్థులు ఆరోపించారు. జీవో-29ని రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అశోక్‌నగర్‌లో గ్రూప్-1అభ్యర్థులు పల్లవి, మహేశ్, జనార్దన్ మీడియాతో మాట్లాడారు. జీవో-29తో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరుగుతున్నదని, జీవో-55 ప్రకారమే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

### విద్యార్థి నేత మోతీలాల్‌నాయక్ అరెస్ట్

నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్ నాయక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. జీవో-29ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నాంపల్లిలోని గాంధీభవన్‌ను ముట్టడించేందుకు యత్నించారు. దీంతో పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### గొంతునొక్కుతున్న సర్కారు

ఉదయం అశోక్‌నగర్‌లో ప్రెస్‌మీట్ నిర్వహిస్తుండగా నిరుద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడేందుకు అభ్యర్థులు సిద్ధం కాగా, అరెస్టు చేస్తాం.. జైల్లో వేస్తాం.. అన్న హెచ్చరికలతో వారంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు. సర్కారు భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్నదని ఉద్యోగార్థులు విమర్శిస్తున్నారు. ఇదేనా ప్రజాపాలన అని ప్రశ్నిస్తున్నారు.


# అప్పుడు రిలీవ్.. ఇప్పుడు రిజైన్

- పోలీస్ శాఖలో రెండు రకాల నిబంధనలు
- సివిల్, ఏఆర్ సిబ్బందికి ఓ న్యాయం, బెటాలియన్ సిబ్బందికి మరో న్యాయమా?
- టీచర్ ఉద్యోగాలు పొందిన బెటాలియన్ ఉద్యోగుల ఆవేదన

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తేతెలంగాణ): పోలీస్ శాఖలోని అన్ని విభాగాల ఉద్యోగులకు ఉమ్మడి సర్వీసు నిబంధనలను వర్తింపజేయాల్సిన ఉన్నతాధికారులు ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లను వెంటనే ఆ విధుల నుంచి రిలీవ్ చేసినప్పటికీ బెటాలియన్లలో పనిచేస్తున్న 29 మంది కానిస్టేబుళ్లకు మాత్రం ఆ ఉద్యోగాలకు రాజీనామా చేసిన తర్వాతే నిరభ్యంతర పత్రాలను (ఎన్‌వోసీ) అందజేశారు. దీంతో గత్యంతరం లేక రాజీనామా చేయాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఒకే శాఖ సిబ్బందికి వేర్వేరు నిబంధనలా?

పోలీస్ శాఖలో శాంతిభద్రతలు, బెటాలియన్, ఫైర్, ట్రాఫిక్, ఎస్పీఎఫ్ తదితర విభాగాలుంటాయి. విధి నిర్వహణకు సంబంధించిన కొన్ని మినహాయింపులు తప్ప ఆ విభాగాల్లోని ఉద్యోగులందరికీ ఒకే సర్వీసు రూల్స్ అమలు చేస్తారు. ఇతర శాఖల్లో ఉద్యోగాలు పొందిన పోలీసులను రిలీవ్ చేసే విధానం



GOVERNMENT OF TELANGANA
(POLICE DEPARTMENT)

Office of the Commissioner of Police Hyderabad City

ORDER

2021లో పోలీస్ కమిషనరేట్ జారీ చేసిన రిలీజ్ ఆర్డర్

ఎప్పటి నుంచో కొనసాగుతున్నది. కానీ, ప్రస్తుతం ఉన్నతాధికారులు ఈ విధానానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. రాజీనామా చేస్తేనే ఎన్వోసీ ఇస్తామని చెప్తున్నారు.

### రిజైన్ చేస్తే తీరని అన్యాయం

రాష్ట్రంలోని 13 బెటాలియన్లకు చెందిన 29 మంది కానిస్టేబుళ్లు డీఎస్సీ-2024లో టీచర్ ఉద్యోగాలు సాధించారు. వారు ఎన్‌వోసీ కోసం తమ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసుల్లో దరఖాస్తు చేయగా కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేశాకే ఎన్వోసీ ఇస్తామని ఏవోలు స్పష్టం చేశారు. దీంతో రాజీనామా చేసిన 28 మంది ఉన్నతాధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కమాండెంట్ మురళికృష్ణను 'నమస్తే' ప్రశ్నించగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే వ్యవహరిస్తామని చెప్పారు.

# అటవీ భూములకు నకిలీ పట్టాలు

- గిరిజనేతరులకు పోడు పట్టాలు
- 40 వేలకు నాలుగు ఎకరాలు
- పాత తేదీలతో పాస్ పుస్తకాల జారీ
- పట్టా పుస్తకాలతో బ్యాంకుల్లో రుణాలు
- వరంగల్, హైదరాబాద్ కేంద్రంగా ముఠా
- ములుగు జిల్లాలో జోరుగా భూదందా

ములుగు, అక్టోబర్ 20 (నమస్తేతెలంగాణ): భూముల ధరలన్నీ ఆకాశాన్ని అంటుతున్న వేళ.. 40 వేలకే నాలుగు ఎకరాల భూమి అంటే ఆశ్చర్యపోతున్నారా? అటవీ భూముల పోడు పట్టాలను ఆసరాగా చేసుకుని ములుగు జిల్లా కేంద్రంలో జరుగుతున్న భూదందా ఇది. ఏజెన్సీ గ్రామాల్లో 1/70 చట్టం అమలులో ఉండగానే పోడు పట్టాల పంపిణీ గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్నది. అదీ గిరిజనులకు కాదు.. గిరిజనేతరులకు పోడు పట్టాలు అందుతున్న తీరు ములుగు జిల్లాలో వెలుగు చూసింది.

### గిరిజనేతరులకు పోడుపట్టాలు

ములుగు మండలంలోని ఏజెన్సీ గ్రామాలకు చెందిన కొందరు రైతులు తమ పేరుపై నాలుగు ఎకరాల చొప్పున పోడు భూముల పట్టాలు పొందినట్టు తెలిసింది. పట్టాలు పొందిన రైతులు జంగాలపల్లి యూనియన్ బ్యాంకులో సంప్రదించి తమకు రుణాలను మంజూరు చేయాలని కోరారు. నిబంధనల ప్రకారం గిరిజనులకే పోడు పట్టాలు రావాలి. కానీ గిరిజనేతరులకు పోడు పట్టాలు రావడం ఏమిటని సందేహం వచ్చిన బ్యాంకు మేనేజర్ పట్టాలను తీసుకెళ్లిన వారిని మందలించినట్టు తెలిసింది. దీంతో మూకుమ్మడిగా పట్టాలు పొందిన వారంతా ములుగు జిల్లా కేంద్రంలోని మరో బ్యాంకుకు వెళ్లి రుణాలు పొందుతున్నట్టు సమాచారం. సదరు బ్యాంకు మేనేజర్ నాలుగు ఎకరాల భూమికి రూ.లక్షా 30 వేల చొప్పున వ్యవసాయ రుణాలు మంజూరు చేసి, ఇన్సూరెన్స్ కింద రూ.30 వేల చొప్పున కట్ చేస్తున్నట్టు తెలిసింది. పట్టా వచ్చిన భూమి ఎక్కడ ఉందో తెలియని సంబంధిత వ్యక్తులు వచ్చిన రుణం ఇంతకు ఇంత నయం అనుకొని బ్యాంకు మేనేజర్ చెప్పిన దానికి ఒప్పుకొని ఇచ్చిన రుణాలను తీసుకుంటున్నట్టు చర్చ జరుగుతున్నది. ప్రస్తుతం రుణాలు పొందిన వ్యక్తులు మరికొందరికి సైతం పట్టాలు అందిస్తామని చెప్పి గ్రామాల్లో బృందాలుగా ఏర్పడి డబ్బులను వసూలు చేస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేపడితే పోడు పట్టాల అక్రమ జారీ దందా వెలుగులోకి రానున్నది.

### పాత తేదీలతో పాస్ పుస్తకాలు

వరంగల్, హైదరాబాద్ కేంద్రంగా కొందరు మధ్యవర్తులు ముఠాగా ఏర్పడి ఈ దందాను నడిపిస్తున్నారు. పాత తేదీల ప్రకారం పాస్ పుస్తకాలను గిరిజనేతరులకు గుట్టుచప్పుడు కాకుండా పట్టాలను చేయించి ఇస్తున్నారు. మధ్యవర్తుల ద్వారా నాలుగు ఎకరాల భూమిని రూ.40 వేల చొప్పున చెల్లించి హైదరాబాద్ కేంద్రంగా పట్టాలు చేయించుకుంటున్నట్టు ఆయా గ్రామాల్లో జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఈ పట్టాలు పొందిన గిరిజనేతరులు బ్యాంకుల్లో రుణాలు కూడా పొందుతున్నారు.

# సీఎం మొండివైఖరి వీడాలి

### మాజీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య



హైదరాబాద్, అక్టోబర్20 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తన మొండివైఖరిని వీడాలని మాజీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ అధ్యక్షతన హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. పరీక్షలు వాయిదా వేయబోమని సీఎం ప్రకటించడం దుర్మార్గమని, జీవో 29 ద్వారా మొత్తంగా రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర జరుగుతున్నదని నిప్పులు చెరిగారు. ఆ జీవో వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తీరని అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. నిరుద్యోగులపై లాఠీచార్జి దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. మెరిట్‌లో వచ్చిన వారిని రిజర్వేషన్ల కింద లెక్కించవద్దని, ఆ విధానం అన్నిస్థాయిల్లో పాటించాలని కోర్టు తీర్పులు చెప్పాయని, కానీ గ్రూప్-1లో ఆ విధానం పాటించడం లేదని ధ్వజమెత్తారు. జీవో నం 55 రాజ్యాంగబద్ధమైనదని, దానిని అమలు చేయాలని, జీవో 29 రిజర్వేషన్ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో నిరుద్యోగ జేఏసీ నేతలు వేముల రామకృష్ణ, రాజేందర్, అనంతయ్య, నందాగోపాల్, ఉదయ్‌నేత, మోదీ రాందేవ్, రుషికుమార్, ఉమామహేశ్వరరావు, సహదేవ్ పాల్గొన్నారు.

### జీవో 55 అమలుచేయాలి: గాలి వినోద్‌కుమార్



ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 20: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో జీవో 55 అమలు చేయాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. 7% జనాభా లేని అగ్రవర్ణాలకు 50% రిజర్వేషన్లను కల్పిస్తున్న జీవో 29ను రద్దు చేసి, మెయిన్స్ పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో జరిగిన పరీక్షలు రద్దు చేసి కేవలం గ్రూప్-1 నోటిఫికేషన్‌లోనే 63 పోస్టులు కలిపి రీషెడ్యూల్ చేసిందని దుయ్యబట్టారు. జీవో 29 తెచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు తీరని ద్రోహం చేసిందని విమర్శించారు.